
# రక్తపు చుక్కలు కన్నీటి మమతలు

వేమకోటి సీతారామశాస్త్రి



అందమైన సముద్రం హోరెత్తిపోతోంది.

అర్ధరాత్రి దాటినా విశాఖపట్నం పూర్తిగా నిద్రపోలేదు.

విశాఖ దీపాల వెలుగులో స్నానం చేస్తున్నది. విశాలమైన బీచ్ రోడ్డుమీద కార్లు మాత్రం, అప్పుడప్పుడూ సంధించి విడిచిన శరాల్లా దూసుకుపోతున్నాయి.

సుశీల మెత్తని యిసుకలో కూర్చుంది. ఆ యిసక ఆమెపాలిట అంపశయ్యలా వుంది. ఆమె కట్టుకున్న సిల్కుచీర అందంలో వాయుదేవుడు సరసమాడుతున్నాడు. ఆమెకు ఆకలి వేస్తోంది. బీచ్‌లో వొకటీ అరా నీడలు కదులుతున్నాయి.

ఆరోజామె లేచిన వేళావిశేషం బాగు లేదు. యెవ్వరూ తారసిల్లలేదు. ఆ ఆశ గూడా ఆమె నిట్టూర్పులమధ్య సన్నగా అడుగంటిపోతోంది. సముద్రం కెరటాలు గూడా ఆమె కుచ్చిళ్ళని ముద్దుపెట్టుకోవాలని ఆరాట పడుతున్నాయి. ఆయాసంతో సన్నగా నురగలు కక్కుకుంటున్నాయి.

నీరసమైన ఆమెకళ్ళకు సముద్రంలో వుండే ఓడ కన్పించింది. అది రంగు రంగుల తోరణాలు అలంకరించుకొని కన్నెపిల్ల కంటున్న కలల్తో వూగులాడుతున్న మనస్సులా తేలుతోంది. యింక కూర్చోలేకపోయింది.

యింతలో చిన్న ఆశ. యెవరో తొందరగా తనకేసి నడిచి వస్తున్నారు.

"పోలీసు కాదుకదా...." భయంతోనే మనస్సులో అనుకుంది. ఆ వ్యక్తి దగ్గర పడిపోయాడు. వేగంగా నడిచినట్లుగా ఆయాస పడిపోతున్నాడు.

"మీరు .... మీరు ...." అతని మాటలు తడబడిపోయినాయి.

"వస్తారా! యిక్కడ ఫర్లాంగు దూరంలోనే మా యిల్లు," అంది సుశీల. మనిషి బాగున్నాడు. డబ్బున్నవాడిలాగే వున్నాడు. లైట్ హౌసు వెలుగు సముద్రంమీద క్షణకాలం మెరిసిమాయమైపోతున్నది, ఆమె మనస్సులో ఆశలా. సుశీల మాటలు అతని కర్థం కాలేదు.

"నా భార్య....నా భార్య కె.జీ హాస్పత్రిలో చావుబ్రతుకుల్లో వుంది. ఆమెకు రక్తం యెక్కిస్తేగాని బ్రతకదు. ఆమె గ్రూపు రక్తం హాస్పటలులో లేదు. రాత్రి యేడుగంటలనుండీ తిరుగుతున్నాం. యెవరిరక్తమూ ఆ గ్రూప్‌కు సరిపోవడం లేదు...." అన్నాడు గాభరాగా.

"అయితే...."

"మీ రక్తం...." అర్థోక్తిలోనే ఆగిపోయాడు.

"నా రక్తమా!" నీరసంగానే నవ్వింది. ఆ నవ్వులో 'ఇంకెక్కడుంది నా శరీరంలో రక్తం, అందరూ పీల్చి పిప్పిచేస్తోంటే' అన్న బాధ ధ్వనిస్తోంది.

"అవును. ఆలస్యం చేయకండి. మీ కెంత డబ్బు కావాలంటే అంత డబ్బిస్తాను...." అన్నాడు. ఆ కంఠంలో ప్రాధేయత తొణికిసలాడుతోంది. సుశీల ఇంకేం ఆలోచించ లేకపోయింది. అచేతనంగానే అతన్ని అనుసరించింది.


దినం ప్రారంభంలోనే ఆమెకు సూర్యకిరణాలు, జీవితాన్ని శూలాల్లా పొడుస్తాయి. యింట్లో గదికి రోజుఅద్దె, లాండ్రీ బట్టలకు అద్దె, కాబూలీవాలాకు రోజువడ్డీ.... యింకా యెన్నో .... యెన్నో.... యివన్నీ ఆమె ఆలోచించే స్థితిలోలేదు. కొన్నిక్షణాల తర్వాత తనకి ముట్టబోయే ప్రతిఫలం కోసం, ఆమె తపన చెందుతోంది.

అతను అడుగులు వడివడిగా వేస్తున్నాడు కారుదగ్గరకు. వెలుగునూ, చీకటినీ ముక్కలు ముక్కలుగా కత్తిరించి, పరిచేసినట్లుగావుంది రోడ్డు. వాటిని దాటుకుంటూ వాళ్ళిద్దరూ. అతన్ని వెనుక నుండి చూసింది. ఆ నడక యెక్కడో పరిచయమైనదిలా కనిపించింది. యెక్కడ పరిచయమో! నవ్వుకొనడానికి గూడా శక్తిలేనట్లుగా వుందామె.

"నెమ్మదిగా నడవండి...." ఆమె మాటలునీరసంగా గొంతునుండి బయటకు రాలేకపోయాయి.

కారు యెప్పుడు ఆగిందో గుర్తులేనంత నీరసంగా కళ్ళుమూసుకుంది. నలుగురైదుగురు కారుదగ్గరకు ఆతృతగా చేరారు. అందరి ముఖాలలో భయాందోళనలు కనిపిస్తున్నాయి.

వొకరు కారుడోరు తెరిచారు. సుశీల దిగింది. "యెలావుంది శాంతకి...." కారు గేరు ఛేంజ్‌చేస్తూ అడిగాడు.




"అలాగేవుంది బాబూ. మనవాళ్ళు యింకో నలుగుర్ని తీసుకువచ్చారు. కానీ వాళ్ళ రక్తంకూడా పనికిరాలేదు," అన్నాడు నిరాశగా.

"మేనేజరుగారూ! వీరినికూడా తీసి కెళ్ళండి...." అంటూనే కారు వెనక్కునడిపించాడు.

సుశీల మేనేజర్ను అనుసరించింది. వార్డులలోవున్నరోగులనిద్రని జాగ్రత్తగా కాపలా కాస్తున్నాయి, బయట దీపాలు. అక్కడక్కడా సన్నగా బాధతో మెలికలు తిరుగుతున్న మూలుగులు వినిపిస్తున్నాయి. తెల్లటి హంసల్లా తిరుగుతున్న నర్సులు చిరునవ్వులతో సేవాధర్మాన్ని పాటిస్తున్నారు.

బ్లడ్‌బాంకుకు చేరుకునేసరికి, సుశీలకి మధ్య హాలులో రక్తదానం గురించి కొన్ని సుభాషితాలు కనిపించాయి. బొమ్మలు గూడా వున్నాయి. "డాక్టరు గారితో వెళ్ళండమ్మా...." అన్నాడు మేనేజరు వినయంగా. సుశీల చీరకొంగు భుజాల నిండుగా కప్పుకుని నడిచింది.

థియేటర్లో డాక్టరు ముఖం సంతృప్తితో మెరిసింది. స్ట్రెచర్‌మీద పడుకున్న సుశీల కళ్ళు తెరిచింది. ఆమె చూపులు తలుపుసందుగుండా దూసుకు వెళ్ళి వొకచోట ఆగిపోయాయి; బీచ్‌లో తనను కారులో తీసుకువచ్చిన వ్యక్తి డాక్టరుతో మాట్లాడుతున్నాడు. అతను తెల్లగా, వుంగరాల జుత్తుతో మధ్య వయస్కుడిలా వున్నా అందంగా వున్నాడు. ఆ ముఖంలో ఆశారేఖలు వెల్లివిరుస్తున్నాయి.

సుశీల అతనిని కొన్ని క్షణాలవరకూ గుర్తించలేకపోయింది. "యెవరతను? యెవరు??" ....అతనే రాజ.... ఆమె మనస్సు చిత్రం అసంపూర్తిగానే మిగిలిపోయింది నర్సు పిలుపుతో.

"నీవుచాలా అదృష్టవంతురాలవమ్మా" అంది నర్సు.

"యెందువల్లనండీ ...." అడిగింది నీరసంగా.

"రాజగోపాలంగారు పెద్ద బిజినెస్ మేగ్నెట్. లేకలేక వరప్రసాదంలా వొక మొగబిడ్డడు పుట్టాడు. కానీ ప్రసవంలో భార్యకు చాలా రక్తం పోయింది. బ్రతుకుతుందన్న ఆశలేదు యింతవరకూ. నీవు ఆమెపాలిట అదృష్టదేవతవి. రాజగోపాలంగారు నీకు చాలా డబ్బు ముట్టచెబుతారు" అంది. చివరిమాటలు రహస్యంగా చెబుతున్నట్లుగా చెయ్యి నొక్కి.

అంత నీరసంలోనూ సుశీల పిడికిలి బిగుసుకుంది. అవును. అతనే రాజ....

గోపాలం .... ఆమె మస్తిష్కంలో జ్ఞాపకాల రంపాలు, జీవితం అడుగున పడి శిథిలమైపోయిన అనుభవాల్ని మళ్లా ముక్కలు, ముక్కలుగా నరికేస్తూ విసిరేస్తున్నాయి.

3 * *

"కాలేజీలో ఏంజల్ బ్యూటీ సుశీల.."

"అవును సానిదాని కూతురు మరెలా వుంటుంది. క్రాస్ బ్రీడ్ ...."

"బోడి బి.యే. చదువెందుకో హేపీగా వృత్తి చేసుకోక."

"బ్యూటీ కంటెస్ట్ పెడితే, మిస్ వరల్డ్‌గా వస్తుందిరా,"

"ఎడ్యుకేటెడ్ ప్రాస్టిట్యూట్‌కి మంచి గిరాకీ వుంటుంది."

"వాళ్ళమ్మ రేటు పెట్టేసింది."

"యెంతటా?...."

"చాలా యెక్కువే. మనం భరించలేం."

"మనం కాలేజీ స్టూడెంట్సుంకదా కాస్త కన్సెషన్ వుండదంటావా ?"

"యేమో అడుగు!"

యివీ పవిత్రమైన విద్యాదానం చేసే దేవాలయాల్లాంటి కాలేజీలో, సుశీల జీవితంమీద పడి చెరిగిపోని ముద్రలు.

ఆరోజు కాలేజీనుండి రావటం కొంత ఆలస్యమైంది. చీకటి చీర సింగారించుకుంటున్న సమయం.

"మిస్ సుశీలా! నీ రేటెంత ?" ఆ కంఠం పక్కనున్న మరి రెండు కంఠాలు వెకిలిగానే నవ్వాయి. అడిగినవాడి చెంప చెళ్ళుమంది. అంతటితో ఆగలేదు. మరి ఆమె కదలలేకపోయింది. మరి కొన్ని క్షణాలయితే, ఆమె సర్వస్వమూ రోడ్డు పక్క పార్కులో కోల్పోయేదే! ఆ పెనుగులాటలో చీకటిని చీల్చుకుని కారు లైట్లు ఆగాయి. వాళ్ళు పారిపోయారు.

"రండి. కారెక్కండి. ఆ రౌడీ వెధవలు పారిపోయారు. మీకు వాళ్ళ పేర్లు తెలిస్తే చెప్పండి. పోలీసులకి రిపోర్టు యిస్తాను." అన్నాడా యువకుడు. అతనే రాజగోపాలం. అలసటతోనే వొద్దని తలవూపింది. కారు కదిలింది. ఆమె భుజాలదగ్గర చోళీ చిరిగిపోయింది. ఆ కాముకుల గోళ్ళు నాటి అక్కడక్కడా రక్తం రావటం మొదలు పెట్టింది. "అయ్యో! పాపం రక్తం" అని అతను గుర్తుచేసేవరకూ సుశీల ఆ షాక్‌నుండి తేరుకోలేదు.

దారిలో నర్సింగ్ హోమ్‌లో యింజక్షన్లూ మందులూ యిప్పించి, కారులో సుశీల యింటిదగ్గర దిగబెట్టాడు. అప్పటికే రాత్రి యెనిమిది గంటలు దాటింది. తనకోసం కళ్ళల్లో వత్తులు వేసుకుని చూస్తున్న తల్లి వొడిలో తల దాచుకుని భోరున యేడ్చేసింది. రాజగోపాలం ద్వారా జరిగినది విన్న తల్లి, అతనికి రెండుచేతులూ యెత్తి దండం పెట్టింది. అర్జంటు పనివుందంటూ కాఫీ గూడా త్రాగకుండానే వెళ్ళిపోయాడు.

నాలుగు రోజుల తర్వాత సుశీల కాలేజీకి వెడుతూంటే, దారిలో కన్పించి కారాపి, సుశీల ఆరోగ్యాన్ని పరామర్శించాడు రాజగోపాలం. సుశీల కృతజ్ఞత చెప్పి యింటికి టీకి రమ్మని పిలిచింది.

అలా పరిచయం పెరిగి వాళ్ళిద్దరి మధ్యా అనురాగలత పెనవేసుకుంది.

"మా నాన్నగారూ, అమ్మగారూ బిజినెస్ టూర్‌మీద అమెరికా వెళ్లారు. వాళ్ళు రాగానే వారితో చెప్పి నేను సుశీలను పెండ్లి చేసుకుంటాను," అన్నాడు సుశీల తల్లితో. ఆమె సంతోషంతో పొంగిపోలేదు. సుశీలను మందలించలేదు. నిర్లిప్తంగా నవ్వింది.

"యువక హృదయంలో ఆరాధనా భావం యెక్కువ. వయస్సుతోబాటు, అనుభవం పెరిగినపుడుగానీ నీ నిర్ణయం తప్పేమో ననిపించవచ్చు. ఆ తర్వాత బాధపడి ప్రయోజనం వుండదు. మరొక్కసారి ఆలోచించు; సుశీల....వొక...." ఆమె మాటల్ని పూర్తిగా చెప్పనివ్వలేదు.

"మీరు చెప్పొద్దు. సుశీల నాకన్నీ చెప్పింది. కొత్త ఆశల్తో, ఆశయాల్తో ముందుకుపోవాలన్న మా యువతరాన్ని మీరు నిరుత్సాహపరచవద్దు. మీ ఇంట్లో వున్న వెంకటరమణమూర్తి సాక్షిగా నేను సుశీలను పెండ్లాడుతాను. ఆమె నా భార్య...." అని ఫోటోను తాకి ప్రమాణం చేశాడు.

అంతే! సుశీల హృదయంలో కోటి సన్నాయి రాగాలు కళ్యాణ గీతికల్ని ఆలపించాయి. శరీరం సిగ్గుతో, ఆనందంతో పులకరించి, పరవసించిపోయింది.

వయస్సు ఆమెచేత తప్పు చేయించలేదు; రాజగోపాలంమీద నమ్మకం వొప్పే చేయించింది.

రాజగోపాలం తలిదండ్రులు తిరిగి వచ్చారు.

"మన వంశమేమిటి? అంతస్థేమిటి? కేవలం బ్రతుకుకోసం శరీరాన్ని అమ్ముకున్న వేశ్యకూతుర్ని చేసుకుంటానంటున్నావ్! నీకు సిగ్గులేదురా? మేం అమెరికాలో మన బంధువులు, పెద్ద బిజినెస్ చేస్తున్న కుమారస్వామిగారి అమ్మాయిని నీకు పెండ్లి చేద్దామనుకుంటున్నాం; మెరుపుతీగే ఆ అమ్మాయి. నీవు కొంత సోషల్ స్టేటస్ గురించికూడా ఆలోచించు...." అంటూనే రాజగోపాలం తండ్రి ఎయిర్ కండిషన్డ్ గదిలో చుట్ట వెలిగించారు.

రాజగోపాలం ఆవేశం చల్లబడిపోయింది. అతను దేవుడిమీద చేసిన ప్రమాణం గడ్డకట్టుకుపోయింది ఆ ఎయిర్ కండిషన్డ్ గదిలో.

ఆ సాయంకాలం....

"మీరు తండ్రి కాబోతున్నారు...." అని సుశీల రాజగోపాలానికి స్వీట్ తినిపిస్తే, అది అతను చేదువిషంలా మింగాడు. పెండ్లి విషయంలో వెంటనే

ముహూర్తం పెట్టించమని గూడా చెప్పింది.

తండ్రి ముహూర్తం పెట్టించాడు; కొడుకు పెండ్లికోసం కాదు. అమెరికా వెళ్లడంకోసం. అమెరికా వెళ్లిన పదిహేనురోజులకే వొకనాటి సాయం కాలం సుశీల పేరున వుత్తరం; ఆర్ణవమైన ఆనందంతోనే చించింది.

సుశీలా !

"కులట కూతుర్ని పెండ్లిచేసుకుంటే మా వంశం కలుషితమైపోతుందని' మా అమ్మా, నాన్నా మన వివాహానికి అంగీకరించలేదు. నీకు నచ్చినవాడిని చేసుకో. మా నాన్నతో నీకు డబ్బు యిమ్మని చెప్పాను. వెళ్లి తీసుకో". యెక్కడి నుండి వ్రాశాడో రాజగోపాలం యెడ్రసు లేదు.

ఆమె మనస్సులోనూ బయటా తుఫాను గాలి వీస్తోంది. పెంచుకున్న ప్రేమను, వర్షం కడిగేస్తున్నది. ఆమె హృదయంలోని ఆశలాగే, ఆ యింట్లో కరెంట్ ఆరిపోయింది.

యేదయితే వొప్పనుకుని చేసిందో అది తప్పని తెలుసుకునేసరికి, ఆమె గుండెలో సన్నని మంటలు ప్రారంభమయ్యాయి. ఉత్తరం ముక్కలు ముక్కలుగా చింపేసి, తల్లి వొళ్లో పిచ్చిదానిలా వలవలా యేడ్చేసింది నిప్పుల నిజం కుమ్మరిస్తూ.

సుశీల తల్లి ఆవేశపడలేదు. కూతుర్ని తిట్టలేదు. గర్భస్రావం చేయిస్తానంది, కొవ్వొత్తి వెలిగిస్తూ.

"వొద్దు....వొద్దు.... యిది పవిత్ర ప్రేమకు చిహ్నం. అతను నీతి తప్పినా, అతని జ్ఞాపకాలయినా నాకు మిగలనీ...." అంది దృఢంగా.

తల్లి నవ్వింది. అనుభవాలు పండిపోయి రాలిపోయినట్లుగా వుందా నవ్వు. ఆమె వీపూ మోచేతులూ జబ్బలూ అన్నీ కూతురుకు చూపించింది. అక్కడకూడా యెర్రటి మచ్చలు వలయాల్లా ఆక్రమించి వున్నాయి.


"యేమయిందమ్మా నీకు... "అడిగింది భయంగా అంత దుఃఖాన్నీ దిగమింగి.

"నీకు జ్ఞాపకం వుందామ్మా ! చిన్నతనంలో 'అమ్మా! నాన్న యెప్పుడు వస్తాడే?' అని అడిగేదానివి. చిన్నతనం కాబట్టియేదో సమాధానంచెప్పి నిన్ను మరిపించేదాన్ని. జవాబులేని ప్రశ్న తల్లీ అది; రేపు పిల్లలు నిన్నా ప్రశ్న అడగకుండా వుండటానికి నిన్ను గుండెల మీద పెంచి, నీకు చదువు చెప్పించి సంస్కారవంతురాలిగా తయారుచేసి నిన్నొక యింటిదాన్ని చేస్తే, నా కర్తవ్యం తీరిపోతుందని యింతకాలం సంతోషపడ్డాను...." ఆమెకు కొత్త ఆయాసం వచ్చింది. సుశీల నీరు త్రాగించింది. "జీవితంలో నీ కేలోటూ తెలియకుండా వుండాలని జాగ్రత్తగా పెంచానమ్మా." ఆగింది దగ్గు వస్తే.

కాంతినిస్తూ కరిగిపోతున్న కొవ్వొత్తిలోనే తల్లి జాలితనాన్నిచూసింది సుశీల.

"వాడి ధర్మమా అని కాలేజీ చదువు మొదటి సంవత్సరంలోనే ఆగిపోయింది. నీకు పిల్లాడో పిల్లో పుడితే ఆపసికందును సాకటంకోసం యెంత శ్రమపడాలో. ఒక వేశ్య కూతురిగాఈ సమాజం నీకెలాంటి స్థానమిస్తుందో ఆలోచించు" అంది గాద్గదికంగా.

సుశీల మరి మాట్లాడలేకపోయింది.



నిర్ణయం మధ్య మనస్సు ఊగిసలాడుతోంది. "మనసు రాయి చేసుకో. కనగానే కొత్త జీవితం ప్రారంభించు. మరొక వూళ్లో ఈ జ్ఞాపకాలు నిన్ను వేటాడనంత దూరంలో బ్రతుకుదాం. నీకు పెండ్లి-సంసారం పిల్లలూ నీకు మంగళప్రదమైన బ్రతుకూ...." మరి మాట్లాడలేకపోయింది తల్లి. ఆమెకు విపరీతంగా మళ్లా దగ్గుతెర, ఆమె పాలిట మృత్యువులా వచ్చేసింది. తల్లి సలహాను కాదనే శక్తి సుశీలకు లేకపోయింది.

ఆ తర్వాత పిచ్చెత్తిపోయిన విధి చేతిలో ఆటబొమ్మై అయింది సుశీల.... కులట కూతురు కులటే అవాల్సివచ్చింది.

ఆ నాడు స్వీటు తినేసి, హాలాహలం వదిలేసి వెళ్ళిపోయిన రాజగోపాలం మళ్ళా యివాళ....హాస్పిటల్లో....

వర్తమానంలోకి వచ్చేసరికి ఆమెను స్ట్రెచర్ మీద శాంత దగ్గరకు తీసుకు వెళ్లారు. "నో! డాక్టర్!! నేను ఈ రాజగోపాలం భార్యకు రక్తం ఇవ్వను. ఆమె చచ్చిపోవాలి డాక్టర్. నా జీవితాన్ని నాశనంచేసి, ఆనందం అనుభవిస్తున్న రాజగోపాలం జీవితం నాశనం కావాలి. జీవితంలో అతను కుళ్ళి కుళ్ళి ఏడవాలి. నన్ను వదిలేయండి. నేను....నేను పారిపోతాను...." అని గట్టిగా అరవాలనుకున్న సుశీల కేకలు గొంతుదాటి రాలేదు. శాంతను పక్కనున్న బెడ్‌మీద చూసేసరికి.

శాంత చాలా అందంగా వుంది. అమాయకంగా నిద్రపోతోంది. శాంతముఖంలో వేదన తాండవిస్తోంది. పక్కనున్న తొట్టిలో పసిపాపడు బుల్లి బుల్లి చేతుల్తో పట్టులాంటి శరీరంతో అటూ యిటూ కదుల్తున్నాడు. సుశీల హృదయం కలుక్కుమంది.

"ఈ క్షణంలో ఆమె నీకు శత్రువు కాదు. నీ జీవితాన్ని నాశనం చేసిన రాజగోపాలం భార్యగా ఆలోచించకు. జీవితం చివరి అంచున నిలబడి మరణ వేదనతో బాధపడుతున్న సాటి స్త్రీమూర్తి మాతృమూర్తి. ఆ పసికందుని పురిటిలోనే తల్లిలేని అనాధగా చేయకు. క్షమ, సహనం, త్యాగం ప్రతి స్త్రీమూర్తీ సంతరించుకున్న వారసత్వం...." అన్న సందేశం సుశీల అంతరాత్మ, అంతర్నాళాలలో అంతర్వాహినే అయింది.

అప్పుడే ఆమె మోచేయికి నీడిల్ గుచ్చబడ్డది. ఆ నీరసంలోనే రక్తం శరీరంలోనుండి తరుగుతున్నట్లుగా లీలగా జ్ఞాపకం వుండిపోయింది, కళ్ళు మూతలు పడుతూంటే....

* * *

కళ్ళు తెరిచిన సుశీలనుచూసి తృప్తిగా నిట్టూర్చింది నర్సు. అర్ధరాత్రి దాటే వుంటుంది. సుశీల స్పెషల్ వార్డులో ఒంటరిగా వుంది. ప్రక్కనవున్న బల్లమీద ఎర్రటి ఆపిల్సు, బ్రెడ్ ఇంకా కొన్ని మందులు ఉన్నాయి.

"ఇప్పుడు యెలావుంది సిస్టర్ శాంత గారికి? వారిద్దరూ క్షేమమేనా?"

"ఆ బాగున్నారు. ఈ రోజు ఉదయమే డిశ్చార్జి చేశారు. రెండు రోజులుగా నీవీ స్థితిలో వున్నావు. నీ కేమవుతుందోనని బెంగపడ్డాం. నువ్వు మళ్ళీ ఈ లోకంలోకి వచ్చావు" అంది నర్సు, ఇంజక్షనిచ్చి, ఫ్లాస్కులో బోర్నవిటా గ్లాసులో నింపి సుశీలకు యిస్తూ. మరో వార్డుకు వెళ్ళొస్తానని చెప్పి వెళ్ళిపోయింది.

సుశీల శాంతనూ, ఆ పసివాడినీ మరో సారి చూడాలనుకొంది. కానీ మరికుదరదు. శాంత బ్రతికినందుకు సుశీల గుండె అనిర్వచనీయమైన ఆనందంతో నిండిపోయింది.తృప్తితోనే కళ్ళుమూసుకుంది.

కళ్ళు తెరిచేసరికి ఎదురుగా రాజగోపాలం. అతని చేతిలో పదిరూపాయల నోట్ల దొంతి వుంది.

"ఎలా వుంది సుశీలా నీకు ఒంట్లో! రెండ్రోజులుగా తెలివిరాకపోయేసరికి భయపడ్డాను" అన్నాడు రాజగోపాలం. వయస్సు వచ్చినా అదే చూపు, అదే మాట, అదే నవ్వు, అదే పలకరింపు. అవన్నీ అప్పట్లోగుప్పెటలాంటిగుండెల్లో దాచుకుంది. తర్వాత వాటికి సమాధి కట్టేసింది. అవి మరి బయటకు రాలేవు. రాజగోపాలం ఏమీ ఎరగనట్లు, ఏమీజరగనట్లు మామూలుగా మాట్లాడుతున్నాడు.

"ఎలా వుంటున్నావు సుశీలా? ఎక్కడ వుంటున్నావ్? ఎంతమంది పిల్లలు? మీ ఆయనేం చేస్తున్నారు?" అని అడుగుతాడేమో అనుకుంది. కానీ అడుగలేదు. సుశీల మాట్లాడలేదు.

"మొదట్లో నిన్ను పోల్చుకోలేకపోయాను. తర్వాత నిన్ను గుర్తుపట్టగలిగాను. నీవు చేసిన సహాయంవల్ల నా భార్య బ్రతికింది. నా బిడ్డకు తల్లి లభించింది. నీకు చాలా కృతజ్ఞుడ్ని. అందుకు ప్రతిఫలంగా ఈ మూడువేల రూపాయలు తీసుకుని...." అంటూనే మంచంమీద వుంచాడు. యేమీ యెరుగని నిర్దోషుల్లా నలిగివున్నా యా నోట్లు.

సుశీల రెండుచేతుల్లోకి నోట్లు తీసుకుంది. అటూ యిటూ తిప్పింది.

"కులట కూతురుని పెండ్లిచేసుకుంటే నా వంశం కలుషితమైపోతుందని నా నుండి పారిపోయావు పిరికివాడిలా. కాని అదే కులటకూతురు మళ్లాకులటేఅయింది. ఆ కులట రక్తమే యివాళ్ళ నీ ఇంటిదీపం నీ భార్య శరీరంలో, అణువణువునా ఆక్రమించివుంది. ఇప్పుడేం చేస్తావ్? ఇప్పుడేం చేస్తావ్??" అని సుశీలలో మిగిలిన రక్తపుచుక్కలు కోపంతో ఉరకలు వేస్తూ అడగాలనుకున్న ప్రశ్నల్ని, ఆమె లోని కన్నీటి మమతలు అడగనివ్వలేకపోయాయి.

నెమ్మదిగా లేచి ఆ నోట్లు రాజగోపాలం మొఖానికేసికొట్టి పిచ్చిగా స్పెషల్‌వార్డులో నుండి బయటకు పరుగెత్తింది సుశీల.

రాజగోపాలం అర్థంగాక కిటికీలో నుండి చూశాడు. యెదురుగా అందమైన సముద్రం హోరెత్తిపోతోంది.